క్లుప్తంగా

అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో అంకమ్మ తల్లి

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువై ఉన్న అంకాళ పరమేశ్వరికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకమ్మతల్లికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగిసేవ, అంకమ్మ తల్లిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించి పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో అంకమ్మ కొండ కోలాహలంగా మారింది.

గ్రామ దేవతకు పొంగళ్లు



అంకాళమ్మ అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు

దొరవారిసత్రం: అత్తివరం గ్రామంలోని గ్రామ దేవత అంకాళమ్మ అమ్మవారికి ఆదివారం గ్రామస్తులు పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పొంగళ్లను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారి వద్ద పొంగళ్లు పెట్టారు. ఈ ఏడాది బాగా వర్షాలు కురువాలని గ్రామస్తులు గ్రామ దేవతను మొక్కుకున్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు గురుమూర్తి, అనిల్‌రెడ్డి, శశిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు



వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

చిట్టమూరు(చిల్లకూరు): కొత్తపాళెం గ్రామంలో దువ్వూరు అక్షయరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట మండలం దొరువుకట్టకు చెందిన దువ్వూరు జనార్ధనరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి నిర్మించిన ఈ ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం భారీ ఎత్తున్న అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

శివారుల్లో కార్డన్ సెర్చ్



తనిఖీలు చేస్తున్న రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్

గూడూరు రూరల్: పట్టణ శివారుల్లోని ఇందిరమ్మ కాలనీ, టిడ్కో ఇల్లు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం కార్డన్ సెర్చ్ చేపట్టారు. గూడూరు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి 9 గంటల వరకు ప్రతి ఇంటిని జల్లెడ పట్టి అక్కడ నివాసాలు ఉండే వారి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడితే అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడినట్లు సమాచారం వస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వృద్ధులకు చీరలు అందజేత



వృద్ధులకు చీరల పంపిణీ

దొరవారిసత్రం: పోలిరెడ్డిపాళెం గ్రామ పరిధిలోని శ్రీకృష్ణా పరమాత్మ గీత మందిరంలో ఆదివారం స్థానిక ఎస్టీ కాలనీలోని వృద్ధులకు తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చీరలు అందజేశారు. సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామానికి చెందిన పి. నాగరాజు, శాంతి సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు నాగరాజు తెలియజేశారు.

వంద రోజుల పాలనంతా బూటకమే

కోట: కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనలో ప్రజలకు ఎటువంటి మంచి జరగలేదని వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గం యూత్ అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన కోటలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదన్నారు. సూపర్‌సిక్స్ పథకాలు నెరవేర్చక పోగా ఇంటింటికీ పోయి ఇది మంచి ప్రభుత్వం అంటూ స్టిక్కర్లు అంటించుకోవడం సిగ్గు చేటన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక తిరుమల లడ్డూ ప్రసాదంపై చంద్రబాబునాయుడు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజల దృష్టి మరల్చడానికి ఇలాంటి నాటకాలకు తెరలేపారని విమర్శించారు.

వేడుకగా ఘటోత్సవం

- భక్త జనసందోహం నడుమ కదిలిన ఘటం
- కనువిందుగా ప్రారంభమైన వెంకటగిరి జనజాతర
- ఆలయాలకు ప్రత్యేక అలంకరణ



ఘటం ఊరేగింపు

సైదాపురం/వెంకటగిరి రూరల్: రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది రెండో ఏటా పోలేరమ్మ జాతర అట్టహాసంగా అశేష జనసందోహం నడుమ ఆదివారం ప్రారంభమైంది. వెంకటగిరి పట్టణం జనాలతో కిక్కిరిసింది. ప్రధాన వీధుల్లో పోలేరమ్మ ఘటం కదిలింది. పోలీసు, దేవదాయశాఖ అధికారుల పటిష్ట బందోబస్తు మధ్య సాంప్రదాయబద్ధంగా ఘటోత్సవం ఆరంభమైంది. ఐదు రోజులు సాగే ఈ జాతరకు దేశవిదేశాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పోలేరమ్మ తల్లి జాతరలో ప్రధాన ఘట్టమైన ఘటోత్సవ వేడుకలు అమ్మవారి మెట్టినింటి వద్ద నుండి ప్రారంభమైంది. అమ్మవారికి బలి ఇచ్చే దున్నపోతును ఘటం వెంటే ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు కాంపౌండ్‌లో దున్నపోతుకు ప్రత్యేక పూజలు కూడా చేశారు.

పురవీధుల్లో ఘటం

భక్త జనసందోహం మధ్య ప్రారంభమైన ఘటోత్సవం ఆదివారం నుంచి గురువారం వరకు పట్టణంలో నిర్విఘ్నంగా కొనసాగుతుంది. ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఘటోత్సవంలో ఘటం పట్టణంలోని అన్ని వీధుల్లో తిరుగుతుంది.

ప్రారంభం ఇలా...

ఈ ఘటోత్సవాన్ని ఆదివారం పట్టణంలోని గాలిగంగుల దేవస్థానంలో ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. అనంతరం 3గంటలకు పట్టణంలోని జీనిగలవారి వీధిలో ఉన్న మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. తప్పెట్లు, తాళాలు, బాణసంచా కాల్పులతో ఉత్సవం ప్రారంభమైంది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ప్రత్యేకంగా అలంకరించిన దున్నపోతును మండపం వద్దకు తీసుకుని వచ్చి ఘటోత్సవాన్ని ప్రారంభించారు. జీనిగలవారివీధి వద్ద ప్రారంభమైన ఘటోత్సవం అంజనేయస్వామి గుడివీధి మీదుగా పోలేరమ్మ దేవస్థానం వద్దకు చేరుకోగానే పూజలు చేపట్టారు. పోలేరమ్మ వీధి నుంచి రాజావీధి, రాజనగరి వెనుక వైపునగల పత్తివారి ఇంటికి ఘటం చేరుకుంది. రాజాల అనుచరులు ఘటానికి ప్రత్యేక పూజలు చేశారు.

ద్వితీయ పూజలు

వెంకటగిరి జాతరలో భాగంగా సాంప్రదాయాలు దశాబ్దాల కాలంగా కొనసాగుతున్నాయనేందుకు రెండో ఘట్టమే నిదర్శనం. అప్పట్లో వెంకటగిరి సంస్థానాధీశుల దగ్గర పనిచేసిన తాడిపత్రి వెంకట్రాయులు ఇంట రెండో పూజ నిర్వహించారు. అనంతరం పట్టణంలో ప్రతి ఇంట ముంగిటకు ఘటం చేరుకుని పూజలు అందుకోవడం ఆనవాయితీ. ఘటోత్సవం ప్రారంభం కావడంతో 25, 26 వతేదీల్లో జరుగునున్న జాతరలో పాల్గొనేందుకు బంధుమిత్రులతో పట్టణంలో సందడి నెలకొంది. ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి, వెంకటగిరి సీఐ ఏవీ రమణ, పోలేరమ్మతల్లి జాతర కమిటీ నిర్వాహకుల పర్యవేక్షణలో ఘటోత్సవం కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఈ ఘటోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ తెలియజేశారు.



ఘటోత్సవంలో యువత కోలాహలం



ఘటానికి పూజలు చేసేందుకు వేచి ఉన్న మహిళలు

పొలాల్లో వ్యక్తి మృతదేహం



మురుగేశన్ మృతదేహం

నాయుడుపేటటౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డి పాళెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలాల్లో ఓ వ్యక్తి మృతదేహాన్ని శనివారం రాత్రి పోలీసులు గుర్తించారు. మృతుడి ఒంటిపై ఉన్న దుస్తుల్లో దొరికిన ఆధారాల మేరకు తమిళనాడుకు చెందిన పరమశిం మురుగేశన్(50)గా తెలిసింది. ఈ మేరకు మృతుడి కుటుంబీకులకు సమాచారం అందించారు. ఆదివారం మృతుడి కుమారుడు బాబు మురుగేశన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదు రోజుల క్రితం మురుగేశన్ తన భార్యతో గొడవ పడి ఇంట్లో నుంచి వచ్చేశాడని, అప్పటి నుంచి వెతుకున్నామని మృతుడి కుమారుడు వెల్లడించాడు. అతిగా మద్యం తాగి మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

చిరుద్యోగులపై అణచివేత విధానం మానుకోవాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

గూడూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చిరుద్యోగులపై చూపుతున్న అణచివేత విధానాన్ని మానుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం చిల్లకూరు మండల కమిటీ సభ్యులు ఇంద్రావతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. చిరుద్యోగులను అణచి వేయాలని చూస్తే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు జోగి శివకుమార్, గోపాల్, ముత్యాలయ్య, బీవీ రమణయ్య, పెంచలమ్మ, మణి, చంద్రయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

24 నుంచి క్రీడా పోటీలు

కోట: ఈ నెల 24 నుంచి రెండు రోజులపాటు ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు కోట బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయని ఎంఈఓ మస్తానయ్య ఆదివారం తెలిపారు. మండల స్థాయి పోటీలు విజయవంతంగా నిర్వహించిన క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియోజకవర్గ స్థాయి క్రీడలను కోటలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని అన్నీ మండలాల నుంచి 1500 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.

అమ్మవారి బంగారు పాదాలకు రూ.17లక్షలు

వెంకటగిరి రూరల్: శ్రీపోలేరమ్మతల్లికి బంగారు పాదాలు తయారు చేసేందుకు రూ. 17 లక్షలు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చేతుల మీదుగా దాతలు సమర్పించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన బీరం ప్రదీప్‌కుమార్, కుటుంబ సభ్యులు రూ.13 లక్షలు, మాడా జానకిరామయ్య, అతని స్నేహితులు రూ.4 లక్షలు అందజేసినట్లు తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులతో అపస్మ ప్రతినిధులు

కలువాయి: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్(అపస్మ) ఆధ్వర్యంలో ప్రైవేట్ సెక్టార్‌లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 23 మందిని ఘనంగా సత్కరించారు. కలువాయి విశ్వం హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరికి జ్ఞాపికలు అందజేసి, శాలువాలు, మాలలతో సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో వారు చూపిన అంకిత భావం, విద్యార్థుల ఎదుగుదలకు వారు చేసిన కృషికి గుర్తింపుగా కలువాయి, బాలాయపల్లి, రాపూరు, సైదాపురం మండలాల్లోని 11 పాఠశాలలకు చెందిన 23 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు అపస్మ జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కృష్ణారావు, స్టేట్ ఈసీ మెంబర్ శివకుమార్, రాపూరు అధ్యక్షుడు మునీందర్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పుల్లయ్య, అన్ని పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి



గాయపడిన అనంతమ్మ

రాపూరు: నిమ్మతోట వద్ద చెలరేగిన వివాదం మహిళపై కత్తితో దాడి జరిగే వరకు వెళ్లింది. పోలీసుల కథనం.. రాపూరు మండలం, జోరేపల్లి అక్కమాంబపురానికి చెందిన పెద్ద సుబ్బయ్య 45 ఏళ్ల క్రితం ఎకరం పొలం కొని దాన్ని సాగుచేస్తున్నాడు. ఆ పొలానికి ఎలాంటి సంబంధంలేని రాఘవయ్య సదరు పొలం వద్దకు వచ్చి పెద్ద సుబ్బయ్య తమ్ముడు పెంచలనరసయ్యతో గొడవకు దిగాడు. ఆపై పెంచలనరసయ్యపై కత్తితో దాడి చేయబోతుండగా ఆయన కూతురు అనంతమ్మ అడ్డువచ్చింది. దీంతో కత్తి ఆమె చేతికి తగిలి తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం ఆమెను రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వెంకటరాజేష్ తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు సత్కారం



అధికారులను సత్కరిస్తున్న బలిజ అభ్యుదయ సేవా సమితి నాయకులు

గూడూరు రూరల్: ప్రజలకు ఉత్తమ సేవలు అందించే బలిజ ఉద్యోగులను ఆదివారం బలిజ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గూడూరు పట్టణంలోని వీరభద్ర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఫంక్షన్ హాలులో ఆదివారం బలిజ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగేశ్వరరావు, డివిజన్ గౌరవ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు మాట్లాడుతూ బలిజ ఉద్యోగులు పేదలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం ద్వారా ఉత్తమ సేవలకు అవార్డులు అందుకున్న వారిని ఘనంగా సత్కరించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు మునిశేఖర్, బాలసత్యనారాయణ, రవీంద్రబాబు, బాలసుబ్రహ్మణ్యం తదితరులను సన్మానించారు. సంఘం శేషయ్య, కళ్యాణసాయి, మదనంబేటి వెంకటరమణయ్య, పవన్‌కుమార్, అక్కన రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దుకాణాలు దగ్ధం



ఆందోళనకు దిగిన బాధితులు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం సమీపంలో డివైడర్లపై ఏర్పాటు చేసుకున్న నాలుగు దుకాణాలు ఆదివారం వేకువజామున దగ్ధమయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు కావాలని దుకాణాలను అంటించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. వివరాలు.. సుమారు 50 ఏళ్లుగా పురపాలక స్థలంలో నక్కలోళ్లు దుకాణాలు, నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆ దుకాణాల వెనుక స్థలం యజమాని గత ఏడాది కోర్టును ఆశ్రయించి వీరి దుకాణాలను తీయించేశారు. అప్పుడు రైల్వేస్టేషన్ సమీపంలో జాతీయ రహదారి పక్కన దుకాణాలు పెట్టుకోవాలని అధికారులు సూచించారు. అయినప్పటికీ నక్కలోళ్లు అక్కడకు వెళ్ల కుండా డివైడర్ల మధ్య దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు, చంపా, ఉదయభాను, శీను అనే వారి దుకాణాలు కాలిపోయాయి. దీంతో రూ.లక్షల విలువైన వస్తువలు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమపై కక్షగట్టి షాపులు కాల్చేశారని ఆరోపిస్తున్నారు. ఈ మేరకు రోడ్డు బైఠాయించి ఆందోళనకు దిగారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

మంచి ప్రభుత్వానికి స్పందన కరువు



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ: టీడీపీ తడ మండలంలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి స్పందన కరువైంది. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ గ్రామానికి వస్తున్న నేపథ్యంలో స్థానిక నాయకులు మందుబాబుల అండతో కొంత హంగామా చేసి, స్వాగతం పలికారు. ఒకటి రెండు ఇళ్లకు కరపత్రాలు అందించారు. అనంతరం వాటంబేడు కుప్పం వద్ద సభ ఏర్పాటు చేశారు. ఆదివారం కావడంతో కొంత మంది సభకు హాజరుకాగా నాయకులు ప్రసంగాలు మొదలు పెట్టారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం తమ పరిధి మేరకు మాట్లాడారు. గ్రామ స్థాయి కూడా లేని కొందరు చోటా నాయకులు స్థాయికి మించి మాట్లాడారు. కార్యక్రమానికి టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మురళిరెడ్డి, పళని, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సభలో తడ ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వ్యవహరిస్తున్న ఎస్.విజయ్‌కుమార్ అధికార పార్టీ నాయకుడిలా తన ప్రసంగం సాగించారు. గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ చంద్రబాబు వచ్చిన తరువాత సిబ్బందికి జీతాలు సక్రమంగా అందుతున్నాయంటూ అక్కసు వెళ్లగక్కాడు. తనకు సంబంధం లేని విషయాలను మాట్లాడుతూ వేదిక మీద ఉన్న నాయకులను ఆకట్టుకుని, తన ఇన్‌చార్జ్ పదవిని పదిలం చేసుకునేలా ప్రసంగించాడు.

ముస్తాబైన ఆలయాలు





వెంకటగిరి పోలేరమ్మ జాతరలో భాగంగా పట్టణంలోని అమ్మవారి అలయాలు ముస్తాబయ్యాయి. అమ్మవారి పుట్టినిల్లు కుమ్మరిళ్లు వద్ద దేవస్థానం, జీనిగులవారి వీధిలోని మెట్టినిల్లు మండపం, అమ్మవారి ప్రధాన ఆలయం, మండపాలు, ఆర్చితోపాటు నిష్క్రమణ మండపం వద్ద ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మరో నాలుగు రోజులపాటు పట్టణం అంతా ఆ ఘటం ఊరేగనుంది. సాంస్కృతిక కార్యక్రమాలను పోలేరమ్మతల్లి ఆర్చి వద్ద నిర్వహించేలా ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే పలు ప్రధాన మార్గాల్లో విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. రాజా వీధిలోని దుకాణదారులకు అధికారులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. - వెంకటగిరి(సైదాపురం)

కనుల పండువగా వసంతోత్సవం



ఊరేగుతున్న శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి

చిట్టమూరు(చిల్లకూరు): మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలిసిన శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్లకు వసంతోత్సవాన్ని వేడుక నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం చేపట్టారు. ఉదయం స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు వసంతోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. ఆలయ ఈఓ శశాంక్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అక్రమ వెంచర్‌లో హద్దు రాళ్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



హద్దురాళ్లు తొలగిస్తున్న సచివాలయ అధికారులు

నాయుడుపేట టౌన్: శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో అక్రమణలో ఉన్న సర్వే నంబరు 81–3లో ఉన్న లక్కిశెట్టిగుంట పోరంబోకు స్థలంలో సచివాలయ అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షి దిన పత్రికలో 'హెచ్చరిక.. కబ్జాదారుకో లెక్క'అంటూ వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. పట్టణ నడి బొడ్డున కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని విక్రయించేందుకు ఏకంగా వెంచర్‌గా మార్చేస్తున్న వైనంపై మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డిని వివరణ కోరడంతో ఆయన అప్పటికప్పుడే స్పందించారు. శనివారం సాయంత్రమే గిండివారితోట సచివాలయ అధికారులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి లక్కిశెట్టిగుంట ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసి ఉన్న హద్దు రాళ్ల తొలగించారు. కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల పాలు కాకుండా జిల్లా కలెక్టర్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులు

గూడూరు రూరల్: గూడూరు పట్టణ, రూరల్ ప్రాంతంలోని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలతోపాటుగా పురుషులకు విడివిడిగా క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారిని ఈ నెల 29న నిర్వహించే జిల్లా స్థాయి క్రీడా పోటీలకు పంపిస్తామని అన్నారు. విజేతలుగా నిలిచిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధీర్, వాసుదేవరావు, మండల నాయకులు రవి, మురళీసింగ్, మురళీమోహన్, నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతర కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

వెంకటగిరి రూరల్: వెంకటగిరి గ్రామశక్తి శ్రీపోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించి ఎస్‌వీఆర్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద ఆవిష్కరించారు. కరపత్రాలను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్‌వీఆర్ చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, ఈఓ శ్రీనివాసులురెడ్డి, ఆలయ కమిటీ నిర్వాహకులు గొల్లగుంట మురళీ, మురగ, గల్ల శ్రీనివాసులు, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలు

వెంకటగిరి రూరల్: శ్రీపోలేరమ్మ తల్లి జాతర సందర్భంగా ఆదివారం అమ్మవారి ఆలయం సమీపంలోని ఆర్చి వద్ద నిర్వహించిన మ్యూజికల్ నైట్ అలరించింది. బీమ్లానాయక్ మొగిలయ్య కిన్నెర, ప్లేబ్యాక్ సింగర్స్ కల్పన, పృథ్వీచంద్ర, సాకేత్, సమీరా భరద్వాజ్, ఫోక్ సింగర్ వరం, గంగ, పల్సర్‌బైక్ రమణ, జాను, గోపాల్, నటరాజ్ మాస్టర్ స్పెషల్ డ్యాన్స్ అత్యంత ఘనంగా నిర్వహించారు. వెంకటగిరి సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వృద్ధ దంపతులకు చేయూత



సాయం అందజేస్తున్న బలిజ నాయకులు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గిండివారితోట వీధిలో ఉంటున్న నిరుపేద దంపతులకు బలిజ ఐక్యవేదిక నాయకులు ఆదివారం చేయూత అందించారు. జానకిరామయ్య, రాజేశ్వరమ్మ దంపతులకు రూ.15 వేల నగదు అందించారు. వారికి దుస్తులు, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, కూరగాయలు సైతం అందజేశారు. బలిజ ఐక్యవేదిక నాయకులు నయనప్పగారి ఏవీ కుమార్, ఆకుల కుబేరుమణి, రాగి శేషగిరి, మనుబోలు కోటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, గిరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కమిటీ ఎంపిక

గూడూరు రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయం నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకుడు పుట్టా శంకరయ్య, అధ్యక్ష, కార్యదర్శులు రఫీ, సేలం శేఖరాచారి బండి క్రిష్ణయ్యల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసుకునేలా ముందుగా తీర్మానం చేశారు. అనంతరం కాకర్ల శ్రీనివాసులును అధ్యక్షుడిగా, వైస్ చైర్మన్‌గా కమలాకర్, పి.శ్రీనివాసులు శెట్టి, నాగరాజు, రమేష్, నరేష్, పోలయ్య, సునీల్, సుదీర్, మునేంద్ర, నాగూర్‌లను ఎంపిక చేశారు.

బదిలీ అయిన ఎస్‌ఐ, ఏఎస్‌ఐలకు సత్కారం



ఎస్‌ఐ పవన్‌కుమార్‌ని సత్కరిస్తున్న పోలీసులు

వాకాడు: ఎస్‌ఐగా పనిచేసి ఇటీవల కోటకు బదిలీ అయిన ఎస్‌ఐ పవన్‌కుమార్‌ని, పదోన్నతిపై నెల్లూరు వెళ్లిన ఏఎస్‌ఐ శ్రీనివాసులురెడ్డిని ఆదివారం వాకాడు పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. వాకాడు ఎస్‌ఐగా బాధ్యతలు చేపడుతున్న నాగబాబుతోపాటు పోలీసు సిబ్బంది బదిలీ అధికారులను దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు వారి సేవలను కొనియాడారు.